క్లుప్తంగా

అసభ్య ప్రవర్తన కేసులో వృద్ధుడికి మూడేళ్ల జైలు

తెనాలిరూరల్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాపట్ల జిల్లా అమృతలూరు గ్రామానికి చెందిన ఏడో తరగతి చదువుతున్న ఓ బాలిక 2021 నవంబరు 3వ తేదీ బజారుకు వచ్చి ఇంటికి వెళుతుండగా దూరపు బంధువు అయిన 70 ఏళ్ల పావులూరి సుబ్బారావు బాలిక చెయ్యి పట్టుకొని లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక భయంతో కేకలు పెట్టి వృద్ధుడిని వెనక్కి నెట్టివేసి దగ్గరలో ఉన్న తన మామయ్య ఇంటికి వెళ్లి జరిగిన విషయం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు అమృతలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ ఎం. వాసు కేసు నమోదు చేసి తెనాలి పోక్సో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా సొమ్ము బాలికకు అందేలా చూడాలని, ప్రభుత్వం నెల రోజుల్లో బాలికకు రూ. లక్ష చెల్లించాలని ఆదేశించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారౌతు వెంకట సాంబశివరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

అట్టహాసంగా వైఎస్సార్ సీపీ రోడ్ షో

- అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ రోడ్‌షో
- హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పిలుపు

తెనాలి: మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురువారం సాయంత్రం నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ అట్టహాసంగా సాగింది. స్థానిక రామలింగేశ్వరపేటలోని పుట్ట రాఘవయ్య రైస్ మిల్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో వందలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మద్దాళి శేషాచలం, వివిధ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు ప్రత్యేక వాహనాల్లో ముందుకు సాగుతూ ప్రజలకు అభివాదం చేశారు. మార్గం మధ్యలో అక్కడక్కడా పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల ప్రజలు నాయకులకు శాలువాలను కప్పి సత్కరించారు. 'మా మద్దతు మీకే' నంటూ భరోసానిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీ 13, 12, 11, 10, 9, 8, 7, 6, 5, 4, 3, 48, 49వ వార్డుల పరిధిలో కొనసాగింది. యువత బైక్ ర్యాలీ చేశారు.



ప్రచారంలో కౌన్సిలర్ అభ్యర్థులతో శివకుమార్, శేషాచలం

ప్రజాగ్రహంతోనే ప్రభుత్వం దిగొస్తుంది... అన్నాబత్తుని శివకుమార్

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ... తెనాలి పట్టణ ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, పార్టీ తరఫున పోటీ చేస్తున్న 51 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలి, కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓటు వేయకూడదనే అంశాలను ప్రజలు ఆలోచించాలని ఆయన పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, ప్రజలకు ఎంతగానో సంక్షేమం అందించామని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించటానికి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కూటమి గట్టాయని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో నెరవేర్చలేని హామీలిచ్చి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాయని చెప్పారు. గత రెండున్నరేళ్లుగా ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పింఛను, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగభృతి వంటి హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేయలేదు, కొత్తగా ఏ ఒక్కరికీ పింఛను ఇవ్వలేదని గుర్తుచేశారు. మూడు పార్టీల ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని చెప్పారు.

విపరీతంగా పెరిగిన ధరలు...

మరోవైపు కరెంటు ఛార్జీలు, కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరిగిపోయి, సామాన్య, మధ్యతరగి ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ధరలను అదుపు చేయటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెలల్లో తెనాలి–మంగళగిరి నాలుగులేన్ల రహదారి పూర్తిచేస్తామని హామీనిచ్చిన నాదెండ్ల మనోహర్ తన హామీని నిలుపుకోలేదన్నారు. వారు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రజలు నిలదీయాలని కోరారు. ఓటర్లు తమ నిరసనను, ఆగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయటం ద్వారా కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని శివకుమార్ కోరారు. ప్రచార ర్యాలీలో పార్టీ నాయకులు తాడిబోయిన రమేష్, షేక్ గోల్డ్ రహిమా, బూరెల దుర్గాప్రసాద్, కాకి దేవసహాయం, ఏలూరి శేషగిరిరావు, బొమ్ము నాగిరెడ్డి, మన్నవ ప్రభాకర్, కాళిదాసు వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, చింకా సురేష్‌తోపాటు కౌన్సిలర్ అభ్యర్థులు నూర్‌బాషా లాల్‌బీ (3వ వార్డు), ముద్దిబోయిన వెంకట శివకృష్ణ (4), కారుమంచి వసుంధర (5), షేక్ సుభాని (6), నీలి అజయ్‌కుమార్ (7), షేక్ రెహమాను అంజుం (8), చుండూరు వెంకటేశ్వరరావు (9), తాడిబోయిన రాధిక (10), వీరిశెట్టి వెంకట సంధ్యారాణి (11), ముత్యాల వెంకట సంధ్యారాణి (12), తోట విజయశాంతి (13), గుర్రం హేమలత (45), పెదలంక వెంకటేశ్వర్లు ((46), గుర్రపుసాల ఉదయలక్ష్మీ నాగపూజిత (48), పెసర్లంక విజయ (49) పాల్గొన్నారు.



శివకుమార్‌కు అభిమానుల సత్కారం



యువత బైక్‌ర్యాలీ

ఫొటోలకు ఫోజులు కాదు... రైతులకు నష్ట పరిహారం ఇవ్వండి

- కూటమి ప్రభుత్వంలో రైతులకు మిగిలింది నష్టమే
- తక్షణమే నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలి
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



అత్తోట గ్రామంలో రైతు చూపిస్తున్న వరి కంకులను పరిశీలిస్తున్న శివకుమార్



కొత్తబొమ్మువానిపాలెంలో దెబ్బతిన్న అరటి గెలలు చూపిస్తున్న రైతు

కొల్లిపర: ప్రస్తుతం క్వింటాల్ ధాన్యంకు రూ.2500 నుంచి రూ.3000 వరకు మంచి రేటు పలుకుతోంది. దీంతో వరి సాగు గిట్టుబాటు అవుతుందని ఎన్నో ఆశలతో ఉన్న రైతుకు తుఫాన్ కారణంగా తీరని నష్టం జరిగింది. ప్రస్తుతం స్థానిక ఎన్నికలు ఉండడంతో కూటమి నాయకులు హడావిడిగా గ్రామాల్లోకి వచ్చి రైతులతో ఫొటోలకు పోజులిచ్చి ఆదుకుంటాం అని నమ్మిస్తున్నారు. ప్రకటనలకు మాత్రమే పరిమితం కాకుండా గతంలో మా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులను ఎలా ఆదుకున్నామో అదే విధంగా తక్షణమే నష్టం జరిగిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలి అని తెనాలి వైఎస్సార్‌సీపీ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు.

మండలంలో దెబ్బతిన్న వరి

స్థానిక నాయకులు, రైతులతో కలసి గురువారం ఆయన తుఫాన్‌కు దెబ్బతిన్న అరటి, మినుము పంటలను పరిశీలించి, ఆయా పంటలకు ఎంత మేరకు నష్టం జరిగింది, పెట్టుబడులు ఖర్చులు, ప్రస్తుతం ఎంత దిగుబడి వస్తుంది అన్న అంశాలను ఆయన వివరంగా అడిగి తెలుసుకున్నారు. వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు అన్ని విధాల నష్టపోయారు. రెండేళ్ల పాలనలో రైతులకు ఎటువంటి నష్టం జరిగినా పట్టించుకోకుండా కేవలం పత్రిక, టివి ప్రకటనలకు మాత్రమే పరిమితమైన ప్రభుత్వం ఏదైన ఉందంటే అది కూటమి ప్రభుత్వం మాత్రమే అని ఎద్దేవా చేశారు. అక్టోబర్ 2025లో మొంథా తుఫాన్ కారణంగా అరటి, వరి రైతులకు తీవ్రంగా నష్టం జరిగింది. ఇప్పటి వరకూ వారికి పరిహారం అందించారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మరల ఇప్పుడు తుఫాన్ కారణంగా అనేక గ్రామాలల్లో వరి, అరటి పంటల్లో తీవ్రంగా నష్టం జరిగింది. ఈ ప్రభుత్వం సాగు నీరు, ఎరువులు ఇవ్వక పోయిన రైతులు బోర్లుపై ఆధారపడి వరి పంటను సాగు చేస్తున్నారు. ఇప్పటివరకూ కౌలుతో కలపి ఎకరాకు రూ.70వేలు ఖర్చు పెట్టారు. మరో 20రోజుల్లో పంట ఇంటి వస్తుంది. నిన్నటి వరకు ఈ ప్రభుత్వం రైతులకు యూరియా, డీఏపీ ఎరువులనే అందించలేకపోయింది. ఇలాంటి ప్రభుత్వ పరిపాలనలో రైతులు ఏవిధంగా జీవనం సాగించాలని ప్రశ్నించారు.

నష్ట పరిహారం అందించిన నాయకుడు జగనన్న ఒక్కడే

గత వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఉపయోగకరంగా ఉండాలని ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల్లో పంటలకు ఏఏ సమయంలో ఎలాంటి మందులు, ఎరువులు వాడాలి అన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. దాంతో పాటు ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తక్షణమే రైతు భరోసా కేంద్రాలు ద్వారా వారికి సహాయ సహకారాలు అందించి , రైతుల పంట ఎంత మేరకు నష్టం జరిగింది అన్న అంశాలను సేకరించి 30రోజులలో నష్టం జరిగిన ప్రతి రైతుకు నేరుగా వారి ఖాతాలో నష్ట పరిహారం అందించిన ఏకైక నాయకుడు జగనన్న ఒక్కడే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కళ్ళం వెంకటప్పారెడ్డి, మండల రైతువిభాగ అధ్యక్షులు అవుతు సాంబిరెడ్డి, కటిక గోపిచంద్, బొల్లిముంత పోతురాజు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పేదోడు పట్టెడన్నం తినాలంటే జగనన్న ప్రభుత్వం రావాల్సిందే

కొల్లిపర : రెండున్నరేళ్ల చంద్రబాబు పాలనలో పేదల బతుకులు దుర్భరమయ్యాని వైఎస్సార్ సీపీ తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అవుతు సీత నగేష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు కళ్ళం వెంకటప్పారెడ్డి,జెడ్పీటీసీ అభ్యర్థిని గుదిబండి సూర్యకుమారి , ఎంపీపీ అభ్యర్థిని పల్లె కోటేశ్వరమ్మ , వివిధ గ్రామాల ఎంపీటీసీ అభ్యర్థులు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర సరకుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని విమర్శించారు. చంద్రబాబు కొడుకు లోకేష్ మాత్రం తన కార్పొరేట్ మిత్రులకు 99 పైసలకే భూములను కట్టబెట్టి దోపిడీకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదోడు పట్టెడన్నం తినాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాల్సిందేనని చెప్పారు. దానికి స్థానిక ఎన్నికలైన ఎంపీటీసీ, సర్పంచుల ఎన్నికలతో నాంది పలకాలని ప్రజలను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి కూటమి రాక్షస పాలన ముగింపునకు ముందడుగు వేయాలని కోరారు.



మున్నంగిలో ప్రచారం నిర్వహిస్తున్న వంగా తిరుమలరెడ్డి, సూర్యకుమారి

- వల్లభాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ1 అభ్యర్థి గాదె శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ 2 అభ్యర్థిని వల్లభాపురం నాగేంద్రం విస్తృతంగా పర్యటించారు. గడపగడపకూ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వారిని, జెడ్పీటీసీగా సూర్యకుమారిని గెలిపించాలని కోరారు.
- మున్నంగి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ1 అభ్యర్థిని పొన్నూరు నాగలక్ష్మి , ఎంపీటీసీ2 అభ్యర్థి వంగా తిరుమలరెడ్డి,జెడ్పీటీసీ అభ్యర్థిని గుదిబండి సూర్యకుమారి ప్రచారం నిర్వహించారు.
- పిడపర్రు గ్రామం ఎంపీటీసీ అభ్యర్థి దర్శి జక్రయ్య దంతలూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.
- తూములూరు గ్రామంలో ఎంపీటీసీ1 అభ్యర్థిని కొల్లూరు మౌనిక, స్థానిక నాయకులతో కలసి గడప గడపకు వెళ్లి గెలిపించాలని కోరారు.

దూకుడుగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారం



35వ వార్డులో కరపత్రం పంపిణీ చేస్తున్న అభ్యర్థిని కొల్లి వెంకట దుర్గా



40వ వార్డులో కరపత్రం పంపిణీ చేస్తున్న అభ్యర్థిని సయ్యద్ రిజ్వానా

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముందు వరుసలో ఉన్నారు. వర్షం వల్ల వాతావరణం అనుకూలించక పోయినా ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి ప్రచారం ముగియనున్నందంతో అభ్యర్థులు ప్రతి ఇంటికి వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ

తెనాలిటౌన్: ఎన్నికల విధుల్లో గ్రామస్థాయి నుంచి వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులందరూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ముందుగా తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి. దుర్గాబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30, 31 తేదీల్లో ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని వివరించారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని వెల్లడించారు.

బెదిరింపులు...బైండోవర్‌లు

- ప్రచారం ముగిసే దశలో కూటమి కుట్రలు
- బైండోవర్ పేరిట వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై పోలీసు వేధింపులు
- ప్రలోభాలు, బెదిరింపులు పతాక స్థాయికి

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ ఎన్నికల ప్రచార హోరు తారస్థాయికి చేరింది. అటు వైఎస్సార్‌సీపీ, ఇటు కూటమి పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాలను ముమ్మరం చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బలంగా ఉన్న వార్డుల్లో వారికి సహకరించే స్థానిక నాయకులు/ఓటర్లను కూటమి నాయకులు ప్రలోభపెడుతున్నారు... కాదంటే బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇంకొంతమంది అభ్యర్థులు మరో అడుగు ముందుకు వేసి పోలీసులతో తహసీల్దార్ వద్ద వైఎస్సార్ సీపీ నేతలను బైండోవర్ చేయిస్తున్నారు.

పోలింగ్‌కు 185 కేంద్రాలు ఏర్పాటు

తెనాలి పట్టణంలో 185 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 83 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా నిర్ధారించారు. మిగిలిన 102 సాధారణ కేంద్రాలుగా నిర్ణయించారు. వీటిలో పట్టణంలోని 1,57,089 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



పోలింగ్‌కు సిద్ధంగా ఉన్న బ్యాలెట్ బాక్సులు

వైఎస్సార్ సీపీ పోలింగ్ ఏజెంట్లే లక్ష్యంగా

పట్టణంలో గతంలో ఎన్నడు లేని విధంగా కూటమి నేతలు కొత్త విష సంస్కృతికి తెరతీశారు. దీనిలో భాగంగా పట్టణంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బలంగా ఉన్న చోట వారితో పాటు వారికి సహకరించే వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. స్వామి భక్తిని చాటుకునేందుకు పట్టణంలోని కొందరు పోలీస్ అధికారులు కూటమి చోటా నాయకుల ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ యాక్టివ్ నేతలు కొందరిని బైండోవర్‌ల పేరిట వేధింపులకు గురిచేస్తున్నారు. బుధవారం కూడ ఓ వార్డులోని కొందరు వైఎస్సార్ సీపీ నేతలను తహశీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ నిబంధన టీడీపీ, జనసేన నేతలకు వర్తించకపోవటం గమనించాల్సిన అంశం. కావాలని కొందరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఏజెంట్లను వివిధ సాకులు చూపి సబ్‌డివిజన్ పోలీస్ అధికారి వారిని అనర్హులుగా ప్రకటిస్తున్నారనే ఆరోపణ వినిపిస్తోంది.

దొంగ ఓట్ల పోలింగ్‌కు వ్యూహం...

దొంగ ఓట్లను పోలు చేయించేందుకు కూటమి నేతలు వ్యూహరచనలో ఉన్నట్టు సమాచారం. ఇందుకోసం పట్టణ సమీపంలోని రూరల్ మండల, కొల్లిపర మండల గ్రామాల్నుంచి జనాన్ని రప్పించే యత్నాల్లో ఉన్నారని చెబుతున్నారు. ఇప్పటికైన ఎన్నికల కమిషన్ స్పందించి తెనాలిలో నవంబర్ 1వ తేదిన జరగనున్న ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు బెదిరింపులు, బైండోవర్‌ల ప్రక్రియకు స్వస్తిపలికేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకులు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ అంశంపై ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తున్నట్టు తెలిసింది.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కొల్లిపర: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, తప్పకుండా రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి, అరటి పంటలను ఆయన అత్తోట, కొల్లిపర, చివలూరు.దావులూరు, తూములూరు , హనుమాన్‌పాలెం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని, రైతులకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.

తెనాలిటౌన్: ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో తీవ్ర ఈదురు గాలులకు, వర్షాలకు నేల వాలిన వరి పొలాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఈదురు గాలుల వల్ల నేల వాలిన వరి పైరును పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు.

ట్రెక్కింగ్ క్యాంప్‌లో తెనాలి విద్యార్థి ప్రతిభ


తెనాలిఅర్బన్: నాగాల్యాండ్ రాష్ట్రంలోని వోఖా ప్రాంతంలో జరిగిన ఎన్‌సీసీ విద్యార్థుల ట్రెకింగ్‌లో తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి రామిశెట్టి యశ్వంత్ గోవర్ధనరావు పాల్గొని విజయవంతంగా ముగించారని ప్రధానోపాధ్యాయురాలు కె.భారతి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థికి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఎన్‌సీసీ అధికారి కొడాలి గోవర్ధన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరగడంపై కేసు నమోదైంది. పట్టణ ముత్తెంశెట్టిపాలెంకు చెందిన వాసిరెడ్డి శ్రీలక్ష్మి కుటుంబానికి రెండు ఇళ్లు ఉన్నాయి. ఓ ఇంట్లోని టీవీ, ఏసీ, ట్యాప్‌లు, వైర్లు, ఇతర గృహోపకరణాలు, వస్తువులు అపహరణకు గురయ్యాయి. శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ ఎస్ఐ విజయ్‌కుమార్ గురువారం కేసు నమోదు చేశారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలే కీలకం

తెనాలిటౌన్: తుఫాను ప్రభావిత వరి పంటలో సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చేపట్టాలని శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ సుజని రావు, డాక్టర్ ఎం రత్నం, డాక్టర్ ఎన్. సాంబశివరావు రైతులకు సూచించారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తో కలసి గురువారం తెనాలి మండలంలోని సోమసుందర పాలెం, కంచరపాలెం గ్రామాల్లో ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. అర్నబ్ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా గింజ, ఆకు దశలో ఉన్న వరి పంట నేలవాలిన ప్రాంతాల్లో రైతులు పలు యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యాధి లేదా పురుగు ఉధృతిని నిర్ధరించిన తరువాత మాత్రమే స్థానిక వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన సస్యరక్షణ మందులను సరైన మోతాదులో వినియోగించాలని రైతులకు సూచించారు.



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సుజనీరావు

నీరు నిల్వ ఉన్న పొలాల్లో లేదా వర్షం కురిసే సమయంలో పిచికారీ చేయకూడదని తెలిపారు. పొలాల్లో నిల్వ ఉన్న అదనపు నీటిని మురుగు కాలువల ద్వారా పంపాలని చెప్పారు. పొలాల గట్లను, మురుగు కాలువలను శుభ్రపరిచి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి నాదెండ్ల మనోహర్ పరామర్శ



తెనాలిటౌన్: తుఫాన్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూరల్ మండలం గుడివాడ గ్రామంలో ప్రహరీ గోడ కూలి మృతి చెందిన బాలుడి భౌతికకాయాన్ని గురువారం ఆయన సందర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన నిరుపేద కుటుంబానికి తీరని దుఃఖ మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి అందవలసిన సాయం తక్షణ అందేలా చూస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొల్లిపరలో పోస్టల్ బ్యాలెట్ సెంటర్ ఏర్పాటు

కొల్లిపర: కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి క్రిష్టి అభినవ్ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎన్నికల విధుల్లో నియమితులైన, అర్హులైన ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు సిద్దార్థ పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ Indian Bank ALLAHABAD

తెనాలి బ్రాంచి

బలిజేపల్లివారి వీధి, మారీస్‌పేట, తెనాలి - 522202, గుంటూరు జిల్లా, ఫోన్: 9912223806, ఇ-మెయిల్: tenali@indianbank.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

"APPENDIX - IV-A" [See proviso to rule 6(2) / 8(6)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)/6(2) తో చదువుకునే నిబంధన క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)ల చేత సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, తెనాలి బ్రాంచికి తనఖా/ఛార్జ్‌గా వుంచిన దిగువ పేర్కొన్న స్థిరాస్తులను, **బకాయిసొమ్ము ది.28-10-2026 తేదీ నాటికి రూ.1,33,71,042/- (అక్షరాల ఒక్క కోటి ముప్పై మూడు లక్షల డెబ్బైఒక్క వేల నలభైరెండు రూపాయలు మాత్రమే)** మరియు **ది.29-10-2026 నుండి** తదుపరి జమకూడు వడ్డీ, కాస్ట్స్, ఇతర ఛార్జీలు, ఖర్చులు మొ॥ వసూలు నిమిత్తం ఇండియన్ బ్యాంక్, తెనాలి బ్రాంచి యొక్క అధీకృత అధికారి దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. మరియు సదరు ఆస్తిని **ది.20-11-2026 తేదీన "ఎక్కడ ఉన్నది అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అది" మరియు "ఉన్నది ఉన్నట్లుగా"** పద్ధతిపై సెక్యూర్డ్ క్రెడిటార్‌చే విక్రయించబడునని **1) మెస్సర్స్ రవీంద్ర ఇంజినీరింగ్ మరియు సాల్‌వెంట్స్(ఋణగ్రహీత), యజమాని:** సంకా రవీంద్ర ప్రసాద్, డి.నెం.14-5-5, శ్రీ మహాలక్ష్మీ నిలయం, గోవిందరాజులవారి వీధి, తెనాలి, గుంటూరు-522202, ఆంధ్రప్రదేశ్, **2) శ్రీ సంకా రవీంద్ర ప్రసాద్ (సంస్థ యొక్క యజమాని), తండ్రి:** ఆంజనేయులు, డి.నెం. 14-5-5, మారీస్‌పేట, గోవిందరాజులవారి వీధి, తెనాలి, గుంటూరు-522202, ఆంధ్రప్రదేశ్, **3) శ్రీమతి సంకా హిమబిందు (హామీదారురాలు), భర్త: శ్రీ సంకా శ్రీనివాస్,** డి.నెం.14-5-5, మారీస్‌పేట, గోవిందరాజులవారి వీధి, తెనాలి, గుంటూరు-522202, ఆంధ్రప్రదేశ్, **4) శ్రీమతి సంకా బిందు మాధవి (హామీదారురాలు), భర్త: శ్రీ సంకా రవీంద్ర ప్రసాద్,** డి.నెం.14-5-5, మారీస్‌పేట, గోవిందరాజులవారి వీధి, తెనాలి, గుంటూరు-522202, ఆంధ్రప్రదేశ్ **మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది. ఇ- వేలం విధానం ద్వారా విక్రయించడానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరములు దిగువ పేర్కొనబడినవి.**

స్థిరాస్తుల వివరములు

ఆస్తి నెం.1 : ఐటమ్ నెం.1 : (దస్తావేజు నెం.4282/2001 ప్రకారం) గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, తెనాలి సబ్ డిస్ట్రిక్ట్, తెనాలి టౌన్, 2వ వార్డు,12వ బ్లాక్, టి.యస్.నెం.333 నందు ఎ.0.26 సెంట్లు, టి.యస్.నెం.334 నందు ఎ.0.11 సెంట్ల విస్తీర్ణమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** బలిజేపల్లివారి వీధి అను పేరుగల మునిసిపల్ బజారు 14-3 అ॥, **దక్షిణం:** షేక్ మీరావలి యొక్క ఆస్తి 96-00 అ॥, **పడమర:** రైల్వే యొక్క ఆస్తి 10-00 అ॥, **ఉత్తరం:** దేవతి హిమబిందు ఆస్తి యొక్క హద్దు (2వ ఐటమ్) 98-06 అ॥.

ఐటమ్ నెం.2 : (దస్తావేజు నెం.4283/2001 ప్రకారం) గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, తెనాలి సబ్ డిస్ట్రిక్ట్, తెనాలి టౌన్, 2వ వార్డు,12వ బ్లాక్, టి.యస్.నెం.333 నందు ఎ.0.26 సెంట్లు, టి.యస్.నెం.334 నందు ఎ.0.11 సెంట్ల విస్తీర్ణమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** బలిజేపల్లివారి వీధి అను పేరుగల మునిసిపల్ బజారు 14-9 అ॥, **దక్షిణం:** 1వ ఐటమ్ 98-06 అ॥, **పడమర:** రైల్వే యొక్క ఆస్తి 10-00 అ॥, **ఉత్తరం:** నల్లా రామారావు యొక్క ఆస్తి 101-00 అ॥. **సమీప డోరు నెం.14-4-87 నందు ఈ నాలుగు హద్దుల మధ్యగల 137.00 చ॥గ॥లు లేదా 115.00 చ॥మీ॥ల విస్తీర్ణముగల ఖాళీస్థలము అన్ని అనుభుక్తపు హక్కులతో సహ.**

ఆస్తిపై ఎన్‌కంబరెన్స్	బ్యాంకుకు తెలిసినంత వరకు ఏమి లేవు
రిజర్వు ధర	రూ.1,20,65,000/-
ధరావత్తు సొమ్ము	రూ.12,06,500/-
బిడ్ పెంపుదల మొత్తం	రూ.10,000/-
ఇ-వేలం యొక్క తేదీ మరియు సమయం	తేది: 20-11-2026 ఉ॥10.00 గం॥ల నుండి సా॥04.00 గం॥ల వరకు
ఆస్తి ఐడి నెం.	IDIB6695987397A

బిడర్లు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://baanknet.com) ను సందర్శించాలని సూచించడమైనది. సాంకేతిక సహాయం కోసం దయచేసి PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ హెల్ప్‌డెస్క్ నెంబర్ 8291220220కు మరియు సర్వీస్ ప్రొవైడర్ హెల్ప్‌డెస్క్‌లో లభించే ఇతర హెల్ప్‌లైన్ నెంబర్‌లకు కాల్ చేయండి PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్‌తో రిజిస్ట్రేషన్ స్థితి కోసం దయచేసి support.baanknet@psballiance.com ను మరియు ఇయండి స్థితి కోసం support.baanknet@psballiance.com ను సంప్రదించండి.

ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఛాయాచిత్రం కోసం మరియు వేలం యొక్క నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://baanknet.com ను సంప్రదించండి. ఈ పోర్టల్‌కు సంబంధించిన స్పష్టీకరణల కోసం, దయచేసి హెల్ప్‌లైన్ నెంబర్: 8291220220 ను సంప్రదించండి. https://baanknet.com వెబ్‌సైట్‌లో ఆస్తి కోసం పైన పేర్కొన్న ఆస్తి ఐడి ఉపయోగించి బిడ్డర్లు శోధించవలసినదిగా సలహా ఇవ్వడమైనది.

గమనిక: ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంప్ డ్యూటీ, బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరాలు మరియు చటబద్ధమైన/ చటబద్ధం కాని బకాయిలు, పన్నులు, రేట్లు, ఎసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరాలు కొనుగోలుదారే భరించవలెను.

స్థలం: తెనాలి, తేది: 29-10-2026

సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్, తెనాలి బ్రాంచి, గుంటూరు జిల్లా.

పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. ఈ ఫోన్ నెంబర్లకు తెలుపగలరు. తగు చర్యలు తీసుకొనబడును.

షేక్ అబ్దుల్లా - సర్క్యులేషన్ ఇన్‌చార్జ్ : 9010614996

తెనాలి - దాసు కొప్పల - 7997958274

యం.మల్లిఖార్జునరావు - JO - 9705977784

టోల్ ఫ్రీ నెం. : 1800 2125 9899

సాక్షి తెలుగు దినపత్రిక

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు. వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు, శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచినవారు

తెనాలి డివిజన్

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)

99122 25447 (తెనాలి)